# భారత్ పేద దేశమే..

## ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్, ఏప్రిల్ 15: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఊహించినట్టుగా 2029కల్లా ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా.. ఇంకా పేద దేశంగానే ఉంటుందేమోనన్న అనుమానాన్ని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యక్తం చేశారు. కాబట్టి సంబురాలకు తావు లేదన్నారు. సోమవారం ఇక్కడ పుస్తకావిష్కరణ సందర్భంగా మాట్లాడుతూ.. సౌదీ అరేబియా ధనిక దేశమైనప్పటికీ.. అభివృద్ధి చెందిన దేశం కాబోదని గుర్తుచేశారు. అలాగే ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించినా.. ఇక్కడి పేదరికం అంతమైపోయినట్టు కాదన్నారు. దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉన్నదని, ఇక్కడ అధిక ఉత్పత్తికి జనమే కారణమన్న ఆయన.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచినంత మాత్రాన ఇక్కడి పేదరికం అంతా పోతుందని కాదని అన్నారు. ఈ క్రమంలోనే తలసరి ఆదాయం విషయంలో భారత్ 139వ స్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. ఇక 2047కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ప్రధాని మోదీ చేసిన ప్రకటనపైనా దువ్వూరి స్పందించారు. అందుకు ప్రభావవంతమైన చట్టాలు, బలమైన రాజ్యం, జవాబుదారీతనం, స్వతంత్రంగా పనిచేసే సంస్థలు అవసరమని అన్నారు.




### వడ్డీరేట్లపై కాంగ్రెస్ ఒత్తిడి చేసేది

అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, పీ చిదంబరంలు వడ్డీరేట్ల తగ్గింపునకు ఆర్బీఐపై ఒత్తిడి తెచ్చేవారని, తద్వారా దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాలను ఎక్కువగా చూపే ప్రయత్నం చేసేవారని దువ్వూరి సుబ్బారావు అన్నారు. 'జస్ట్ ఏ మెర్సెనరీ?: నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరియర్' పేరుతో రాసిన తన పుస్తకంలో ఈ మేరకు తెలియజేశారు. 'రిజర్వ్ బ్యాంక్ యాజ్ ది గవర్నమెంట్స్ చీర్‌లీడర్?' పేరిట రాసిన చాప్టర్‌లో వడ్డీరేట్ల విషయంలో మాత్రమే అప్పటి కేంద్ర ప్రభుత్వ జోక్యం పరిమితం కాలేదని.. జీడీపీ, ద్రవ్యోల్బణం అంశాల్లోనూ నిజాల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని చెప్పుకొచ్చారు. ఇక చిదంబరం తన న్యాయవాది తెలివితేటలతో వాదించేవారన్న దువ్వూరి.. ప్రణబ్ ముఖర్జీని మాత్రం పక్కా రాజకీయవేత్తగా అభివర్ణించారు. ఏపీకి చెందిన దువ్వూరి 2008 సెప్టెంబర్ నుంచి 2013 సెప్టెంబర్ వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు.

# పెట్రో ధరలకు రెక్కలు?

## అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల ప్రకంపనలు

**బ్యారెల్ ధర 100 డాలర్లకు వెళ్తుందన్న అంచనాలు • భారత ఆర్థిక వ్యవస్థకు దెబ్బేనంటున్న మెజారిటీ నిపుణులు**





న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఇతరత్రా ఇంధనాల ధరలు పెరగనున్నాయా?.. అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయిప్పుడు. దేశ ఇంధన అవసరాలు దాదాపు 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై భారీగానే ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఆందోళనలు గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల్ని ఎగదోస్తాయని కూడా వారు అంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా ఇంధన ధరలు పరుగులు పెట్టడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.

**ఇదీ సంగతి..**

ఈ నెల 1న సిరియాలోని ఇరాన్ కాన్సులేట్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కూడా దీన్ని ధ్రువీకరించింది. నిర్దిష్ట లక్ష్యాలను గురిపెడుతూ ఈ దాడి జరిగిందని పేర్కొన్నది. దీంతో ఇజ్రాయెల్ సైనిక స్థావరాలే లక్ష్యంగా 300లకుపైగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి ఇజ్రాయెల్ స్పందించే తీరునుబట్టి గ్లోబల్ మార్కెట్లు నడుస్తాయని అంటున్నారు. ఇరాన్ దాడుల మధ్య నిరుడు అక్టోబర్ నుంచి ఎప్పుడూ లేనంతగా ముడి చమురు ధరలు శుక్రవారం పెరిగాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. ఇరాన్‌పై ప్రతీకార దాడుల్లో తాము పాల్గొనబోమని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుకు స్పష్టం చేశారు. ఇది కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయగలదన్న అభిప్రాయాలు ఇప్పుడు ఉన్నాయి.

**హార్ముజ్ జలసంధి కీలకం**

హార్ముజ్ జలసంధి ద్వారా జరిగే రవాణాకు అంతరాయం ఏర్పడితే గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలకు పట్టపగ్గాలుండబోవని విశ్లేషకులు అంటున్నారు. ఒమన్, ఇరాన్ మధ్య ఈ జలసంధి ఉన్నది. ప్రపంచ ముడి చమురు సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతున్నది. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధాలున్న ఓ వాణిజ్య నౌకను ఈ జలసంధిలో ఇరాన్ అడ్డుకున్నది. ఇది ఇంతటితో ఆగకపోతే కష్టమే. భారత్‌కూ ముడి చమురు సరఫరా తగ్గిపోతుంది. ఒపెక్ కూటమి సభ్యదేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ, కువైట్ ,ఇరాక్‌ల నుంచి ఈ జలసంధి ద్వారానే పెద్ద ఎత్తున చమురు రవాణా జరుగుతుంది. భారత్ క్రూడాయిల్‌ను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో సౌదీ కీలకమన్న సంగతి విదితమే.

### బ్యారెల్ 100 డాలర్లకు..

*మిడిల్ ఈస్ట్ దేశాల్లో చీమ చిటుక్కుమన్నా.. భారత్‌లో అలజడి మొదలవుతుంది. దీనికి కారణం చమురు ఎగుమతి దేశాల్లో మిడిల్ ఈస్ట్ దేశాలే ముందుండటం, అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ తొలి వరుసలో ఉండటమే. కాబట్టి ఆయా దేశాల్లో ఉద్రిక్తతలు ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగిస్తే.. భారత్‌లో డిమాండ్‌కు తగ్గ సప్లై ఉండబోదు. దీంతో సహజంగానే ధరలు రెక్కల్ని తొడుగుతాయని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగినా, ఇంకా పెరిగినా బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లను తాకుతుందన్న అంచనాలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే సోమవారం ఉదయం జరిగిన ట్రేడింగ్‌లో చమురు ధరలు తగ్గుముఖం పట్టడం విశేషం. దీనికి కారణం మార్కెట్ భాగస్వాములు రిస్క్ ప్రీమియంలను తగ్గించడమే. ఇరాన్ దాడులతో తమకు పెద్ద నష్టమేమీ జరుగలేదని ఇజ్రాయెల్ చేసిన ప్రకటనతో రిస్క్ ప్రీమియంలు తగ్గాయి.*

*లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరుగడం ఖాయంగా కనిపిస్తున్నది. ఆయా రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యానే కేంద్ర ప్రభుత్వం చాలా రోజుల నుంచి చమురు ధరల పెంపును ఆపుతున్నదనే అభిప్రాయాలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే ఆ ప్రభావం ఎన్నికల ఫలితాలపై తప్పక ఉంటుందనే వ్యూహాత్మకంగా ఇంధన ధరల్ని స్థిరంగా ఉంచుతున్నారని అంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు ముగిస్తే చమురు మార్కెటింగ్ సంస్థలు రేట్లను పెంచడం మొదలు పెట్టేస్తాయని, అప్పుడిక ఎప్పటికి ఈ వడ్డింపులు ఆగుతాయో కూడా చెప్పడం కష్టమేనని వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. లీటర్ పెట్రోల్ రూ.120-125ను తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. ఇదే జరిగితే ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తుందని, దాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుతుందని, ఫలితంగా కీలక రంగాల్లో స్తబ్ధత, జీడీపీలో మందగమనం ఒకదాని వెంట ఒకటి జరిగిపోతుందని వివరిస్తున్నారు. మొత్తానికి ఏం జరిగినా లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా రేట్లు అలాగే ఉండి, ఆ తర్వాత అధికారంలోకి ఎవరు వచ్చినా ధరలు పరుగులు పెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.*

# స్టాక్ మార్కెట్‌లో యుద్ధ భయాలు

## భారీగా నష్టపోయిన సూచీలు

ముంబై, ఏప్రిల్ 15: దేశీయ స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ప్రపంచ మార్కెట్లు ఒక్కసారిగా అలజడికి గురయ్యాయి. మదుపరుల్లో ఆందోళన పెరగడంతో అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రపంచమార్కెట్లతోపాటు దేశీయ సూచీలు కుప్పకూలాయి. వరుసగా రెండోరోజు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ భారీగా నష్టపోయింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీ చివరకు 845.12 పాయింట్లు లేదా 1.14 శాతం నష్టపోయి రెండు వారాల కనిష్ఠ స్థాయి 73,399.78 పాయింట్లను తాకింది. మరో సూచీ నిఫ్టీ కూడా 246.90 పాయింట్లు కోల్పోయి 22,272.50 వద్ద ముగిసింది. గత సెషన్లలోనూ సూచీలు ఒక్క శాతానికి పైగా కోల్పోయిన విషయం తెలిసిందే.

**ఆవిరైన 5 లక్షల కోట్లు**

మిడిల్ ఈస్ట్ దేశాల్లో నెలకొన్న పరిస్థితులు మదుపరుల్లో ఆందోళనలను పెంచింది. ఫలితంగా సోమవారం సెషన్‌లోనే మదుపరులు రూ.5 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.5,18,953.97 కోట్లు కోల్పోయి రూ.3,94,48,097.94 కోట్లకు(4.73 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది.

- విప్రో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్‌లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి.
- టాటా మోటర్స్, టెక్ మహీంద్రా, హెచ్‌యూఎల్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్‌లు ఒక్క శాతానికి పైగా పడిపోయాయి.
- వీటితోపాటు ఐటీసీ, మహీంద్రా, కొటక్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, రిలయన్స్, ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి.
- కానీ మారుతి, నెస్లె, సన్‌ఫార్మా షేర్లు లాభాల్లో ముగిశాయి.
- దేశీయ కరెన్సీకి చిల్లులు పడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 6 పైసలు పతనం చెంది 83.44 వద్ద ముగిసింది.



### పతనానికి కారణాలు

- ***విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను వెనక్కి తీసుకోవడం***
- ***అమెరికా ద్రవ్యోల్బణం పెరగడంతో వచ్చే సమీక్షలోనే వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం***
- ***ఇజ్రాయిల్-ఇరాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకోవడం***

# ధరలు తగ్గించిన ఓలా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఎంట్రీ లెవల్ స్కూటర్ ఎస్1 ఎక్స్ మాడల్ ధరను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తగ్గించింది ఓలా ఎలక్ట్రిక్. ఫిబ్రవరిలో ఎస్1 ఎక్స్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ.. కేవలం రెండు నెలల్లోనే ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ నూతన ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో 4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.1,09,999 నుంచి రూ.99,999కి దిగిరానుండగా, 3 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర కూడా రూ.89,999 నుంచి రూ. 84,999కి, 2 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ రూ.79,999 నుంచి రూ.69, 999కి దిగిరానున్నాయి.

## అంబుజా చేతికి మై హోమ్ గ్రైండింగ్ యూనిట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్స్..మై హోమ్ గ్రూపునకు చెందిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను హస్తగతం చేసుకున్నది. తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద ఉన్న గ్రైండింగ్ యూనిట్‌ను రూ.413.75 కోట్లకు కొనుగోలు చేసింది. 1.5 మిలియన్ టన్నుల కెపాసిటీ కలిగిన మై హోమ్ గ్రూపునకు చెందిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ కొనుగోలుకు సంబంధించి ఇరు సంస్థలు ఒప్పందంపై సంతకాలు కూడా చేశారు. దక్షిణాది మార్కెట్లోవున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో అదానీ గ్రూపు ఈ కొనుగోలు జరిపింది. దీంతో అదానీ గ్రూపు సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 78.9 మిలియన్ టన్నులకు చేరుకున్నది.

## బైజూస్ సీఈవో రాజీనామా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: బైజూస్ ఇండియా సీఈవో అర్జున్ మోహన్ తన పదవికి రాజీనామా చేశారు. గతేడాది జూలైలో బైజూస్‌లో చేరిన అర్జున్ అంతలోనే రాజీనామా చేయడం విశేషం. దీంతో కంపెనీ ఫౌండర్ రవీంద్రన్..సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. మోహన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బైజూస్‌లో 4 వేల మంది సిబ్బందిని తొలగించారు.

## హియర్‌జాప్ విస్తరణ

హైదరాబాద్, ఏప్రిల్ 15: హియరింగ్ కేర్ సొల్యూషన్స్ సంస్థ హియర్‌జాప్..హైదరాబాద్‌లో తన 100వ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సిమెన్స్ వినికిడి సాధనాల సీఈవో ఎస్‌కే శర్మ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా హియరింగ్ కేర్ మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో వచ్చే రెండేండ్లలో స్టోర్ల సంఖ్యను 250కి పెంచుకోనున్నట్లు ప్రకటించారు. అలాగే భవిష్యత్తులో 500కి పెంచుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.